క్లుప్తంగా

సంప్రదాయంగా పుత్ర గణపతి వ్రత పూజలు



పుత్ర గణపతి పూజలు చేస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారితోటలోని శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారి దేవస్థానంలో సంప్రదాయ బద్ధంగా పుత్ర గణపతి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో కొత్తూరి వెంకటేశ్వరావు, శివరంజని దంపతులచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ మట్టి గణపతి విగ్రహానికి కుంకుమ పూజలు వేద మంత్రాలతో హోమాలు నిర్వహించారు. అనంతరం అలయ ప్రాంగణంలో వ్రత పుస్తకాలు, 108 బొబ్బట్లు, కుడుములు, గరిక పూజ చేసి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



డీఈ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భీమవరం డీఈ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా తమ సమస్యలు పరిష్కరించలేదన్నారు. 10 ఏళ్లుగా పని చేస్తున్నామని సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని విజ్ఞప్తి చేశారు.

పవిత్ర మాసం రంజాన్



ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న డాక్టర్ ఎండీ బిలాల్

ఆకివీడు: పవిత్ర రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగ అని డాక్టర్ ఎండీ బిలాల్ అన్నారు. స్థానిక కోసూరు వారి వీధిలోని జలీల్ మసీద్ వద్ద పేదలకు ఇఫ్తార్ విందును మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపవాస దీక్షలతో ముస్లింలు ఎంతో పవిత్రంగా రంజాన్ పండుగను నిర్వహిస్తారన్నారు. పేదలకు ఇఫ్తార్ విందును అందజేసిన కిషోర్‌కు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ జక్కీ అహ్మద్, ఎండీ మాబూ, ఆతిఫ్, మొబిన్, ఎస్‌కే బాజీ, ఆరీఫ్, అజ్మల్, జావీద్, బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

దాళ్వాకు నీటి ఎద్దడి ఉండదు



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ, ఏఓ

ఆకివీడు: దాళ్వా సాగుకు నీటి ఎద్దడి ఉండదని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏఓ ప్రియాంక చెప్పారు. స్థానిక సమతానగర్‌లో మంగళవారం పొలం బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాళ్వాలో రైతులు మూడు విడతలుగా ఎరువుల వాడకం పూర్తయిందన్నారు. ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని చెప్పారు. వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉందన్నారు. మెట్ట ప్రాంతంలో మాసూళ్ల పూర్తి అవుతున్నందున డెల్టా ప్రాంతానికి నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

కాళ్ల: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన విజయవాడలో చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలు విజయవాడ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ మంగళవారం కాళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం నిర్వహించిన ఆశావర్కర్స్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పైడితల్లి, ఉపాధ్యక్షురాలిగా కృష్ణవేణి, కార్యదర్శిగా అనిత, సహాయ కార్యదర్శిగా దీనకుమారి ఎన్నికయ్యారు.

సచివాలయాలకు కూటమి కుదుపు

- రెండు సచివాలయాలు ఒకటిగా విలీనం
- పల్లె ప్రజలకు దూరం కానున్న సేవలు
- మైళ్ల దూరం నడవాల్సిందే
- రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక



సచివాలయం



సచివాలయంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న సిబ్బంది

ఆకివీడు: పల్లె ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారం మరింత భారం కానుంది. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా అందుతాయని గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. సుమారు 530 సేవలను ప్రజలకు అందించే దిశగా సచివాలయ వ్యవస్థను దేశంలోనే ప్రథమంగా రూపొందించారు. గత ఐదేళ్లుగా ప్రజల ముంగిటే సమస్యల పరిష్కార మార్గం లభించింది. గాంధీజీ కలలు కన్న సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం చిదిమేస్తుంది. రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా రూపొందించేందుకు విస్తృత స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలో సచివాలయ వ్యవస్థ కుదింపునకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, కార్యదర్శులు సచివాలయ కుదింపుపై కసరత్తు చేస్తున్నారు. రెండు రోజుల్లో నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆదేశాలు జారీ చేశారు. ఉండి నియోజకవర్గంలోని 72 సచివాలయాలకు గానూ 35 లేదా 36 సచివాలయాలుగా మార్పు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

పోస్టుల కుదింపునకు శ్రీకారం

సచివాలయంలో 11 పోస్టులతో నడుస్తున్న వ్యవస్థలో పోస్టులను కుదించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సచివాలయంలో సంక్షేమ అధికారి, వీఆర్వో, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, మత్స్యశాఖ, ఏఎస్ఎం, ఉపాధి హామీ, మహిళా పోలీస్ విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ముఖ్యంగా వెల్ఫేర్, వీఆర్వో, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఏఎస్ఎం, అగ్రి కల్చరల్, మత్స్య లేదా వెటర్నరీ, ఉపాధి శాఖలుండే అవకాశం ఉందంటున్నారు. మొత్తం శాఖల్లో 9 శాఖలు పని చేయొచ్చని చెబుతున్నారు. మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖలకు బదలాయిస్తారని తెలిసింది.

మైళ్ల దూరం నడవాల్సిందే

ప్రభుత్వ సేవలు పొందేందుకు మైళ్ల దూరం నడవాల్సిందేనంటున్నారు. రెండు సచివాలయాలు ఒకటిగా చేయడంతోమొక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్లాలంటే కనీసం నాలుగైదు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. పనులు మానుకుని ఆయా సచివాలయాలకు వెళ్లినా సిబ్బంది అక్కడ ఉంటారన్న నమ్మకం ఉండదని, క్యాంపులు, డిప్యూటేషన్లని చెబుతారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థను యథావిధిగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

నియోజవకర్గంలో సచివాలయాల వివరాలు

మండలం	సచివాలయాలు	కుదింపు
ఆకివీడు	12	6
ఉండి	21	10
కాళ్ళ	21	10
పాలకోడేరు	18	9

మా సచివాలయం మార్చొద్దు



సచివాలయాల కుదింపు చర్యను ప్రభుత్వం చేపట్టింది. మా గ్రామంలోని సచివాలయ భవనాన్ని ఎంతో కష్టపడి కట్టుకున్నాం. తలు ముందుకొచ్చి స్థలం కేటాయించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ తరుణంలో సచివాలయం కుదింపు ప్రక్రియలో మా సచివాయాన్ని మరో సచివాలయంలో విలీనం చేయొద్దు.

– సైదాల సూర్యనారాయణ, మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు, చెరుకుమిల్లి

ప్రజలకు సేవలను దూరం చేయొద్దు



మేజర్ పంచాయతీగా ఉన్న దుంపగడప సచివాలయాన్ని యథావిధిగా కొనసాగించాలి. మా సచివాలయాన్ని మరో సచివాలయంలో విలీనం చేయొద్దు. గ్రామంలో బీసీలు, ఎస్సీలు అధికంగా ఉన్నారు. శ్రమ జీవులు అధికంగా ఉన్న మా గ్రామ సచివాలయంలో పనులు త్వరితగతిన చేయించుకుంటున్నారు. వేరే ప్రాంతాలకు వెళితే పనులను నిలుపుదల చేసుకోవలసి వస్తుంది.

– కుర్రెళ్ల పోలు, గ్రామస్తుడు, దుంపగడప

8న ఉచిత వైద్య శిబిరం

ఉండి: ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు (హెడ్) ఆధ్వర్యంలో ఉండి బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన ఇంటి వద్ద గల ఖాళీ స్థలంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ వైద్య శిబిరం స్థానిక ఆర్ఎంపీ వైద్యుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భీమవరం ప్రాంతానికి చెందిన మిత్ర మెడికేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ కర్రా, డాక్టర్ వర్ధన్ కాకులపాటి బీపీ, షుగర్, జనరల్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. ఉండి పరిసర గ్రామ ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సుబ్బారావు కోరారు.

పేరాబత్తులకు కేంద్ర మంత్రి అభినందనలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయానికి కృషి చేసిన పట్టభద్రులకు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రులు ఏ ఆకాంక్షల కోసమైతే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించారో వాటి సాధనకు ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని గ్రాడ్యుటీ అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్, ఐసీడీఎస్ పీడీలకు అందజేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలనే జీవోలను వెంటనే ఇవ్వాలని కోరుతూ ఈ నెల పదో తేదీన విజయవాడలో ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలన్నారు. ఓ పక్క ధరలు పెరిగి విపరీతమైనటువంటి ఇబ్బందులకు గురవుతుంటే రెండో పక్క పని భారంతో చాలా సతమతమయ్యే పరిస్థితి కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి అంగన్‌వాడీలకు ఒక పైసా కూడా జీతాలు పెరగలేదని ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఈ డిమాండ్లతో మార్చి 10వ తేదీన నిర్వహించే ధర్నాల్లో అంగన్‌వాడీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైట్ల ఉషారాణి, కానూరు తులసి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి ఉద్యమించాలి



ప్లాస్టిక్ నిషేధంపై మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాఘవ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారని, వాడితే కఠిన చర్యలు తప్పవని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాఘవ అన్నారు. భీమవరం కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాఘవ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజానికి ఉద్యమించాలన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 30 రోజులుగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, గుడ్డ సంచులనే వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలతో పాటు జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ లక్ష్మి తులసి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6న అంతర్ కళాశాలల పోటీలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎస్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్

భీమవరం (ప్రకాశంచౌక్): డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మార్చి 6న రాష్ట్ర స్థాయి సెమినార్, అంతర్ కళాశాలల పోటీలు నిర్వహించనున్నామని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కార్యక్రమ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. విద్యార్థులకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్ పోస్టర్ ప్రజెంటేషన్ క్విజ్, కల్చరల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులకు ఈ పోటీలు వలన విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ఉపయోగపడతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఒడుపు గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవ ధాన్యాలు సాగు చేయండి



ప్రకృతి సాగుపై మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

ఆకివీడు: రైతులు రబీ సాగు మాసూళ్లు పూర్తయిన తరువాత నవ ధాన్యాలను సాగు చేయాలని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాల సాగుతో భూమిలో సారం పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గుతుందన్నారు. వరి చేల గట్లపై కూరగాలయ విత్తనాలను సాగు చేయాలని సూచించారు. వర్మీ కంపోస్టును మహిళలు తమ ఇంటి వద్దే ఉత్పత్తి చేయొచ్చని వివరించారు. కిచెన్ గార్డెన్లలో వర్మీ కంపోస్టు ఉపయోగించి, మంచి కూరగాయలను సాగు చేయాలన్నారు. రైతులకు, మహిళలకు ప్రకృతి సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ప్రియాంక, మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత గోపాలన్

ఆకివీడు: వేసవి ప్రారంభంలోనే మంచినీటి కోసం చుక్కలు చూపిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి జెఎన్వీ గోపాలన్ ధ్వజమెత్తారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం డోకల లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ ప్రజలకు మంచినీరందివ్వలేని దుస్థితిలో ప్రభుత్వాలున్నాయన్నారు. ఆర్వో నీరు కొనుగోలు చేసి తాగుతున్నా కనీసం వాడకానికి కూడా పనికిరాని నీటిని సరఫరా చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొన్ని గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చలేదన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో స్థానం లేదని గోపాలన్ ఆరోపించారు. మహిళలకు రూ.1500, ఉచిత బస్సు బడ్జెట్ ఎక్కలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డి.రవితేజ, బీవీ వర్మ, బి.రాంబాబు, బి.కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.భానునాయక్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించేలా గోడ పత్రికలు, హోర్డింగులు, ప్రకటనలు చేయకుండా స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయమని అడిగిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులని తెలిపారు.

భక్తాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



భక్తాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న సర్పంచ్ భాగ్యశ్రీ దంపతులు

కాళ్ల: కోమటిగుంట భక్తాంజనేయస్వామి ఆలయంలో సర్పంచ్ బోణం భాగ్యశ్రీ, శివకుమార్ దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గుణమాసం పంచమి పర్వదినం సందర్భంగా తొలుత స్వామి వారికి ప్రీతిపాత్రమైన తమలపాకులతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతి నెలా మొదటి మంగళవారం స్వామి వారికి ఇలా ప్రత్యేక పూజలు చేసి అన్నదానం ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తుందని సర్పంచ్ దంపతులు తెలిపారు. దీనిలో భాగంగా సర్పంచ్ కుటుంబీకుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞత కూడికలు



ప్రసంగిస్తున్న థియోఫిలాస్

పాలకోడేరు: ప్రతి ఒక్కరు దేవుని యందు భయభక్తులు కలిగి ఉండాలని క్రీస్తు పురానికి చెందిన డాక్టర్ థియోఫిలాస్ అన్నారు. మండలంలోని మోగల్లులో కృతజ్ఞత కూడికలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ కూడికలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న థియోఫిలాస్ ప్రసంగిస్తూ చేసిన మేలులకు దేవుని యందు కృతజ్ఞతా భావం కలిగి ఉండాలని ఉపదేశించారు. ప్రతి ఏడాది వారం రోజుల పాటు ఈ కూడికలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వై.జయరాజు, బి.సత్యం, బూసి జయప్రసాద్, వై.జార్జ్‌ముల్లర్, దానియేలు, విజయ్‌కుమార్, సాలోమోన్, ఎలిషా ఆశాపు రాజు, విమల కుమారి మోషే, శాంతారావు అబ్రహం, గోపే జయ, రామకూరి కుమారి, రేవూరి అనంతలక్ష్మి, చిల్లా భాగ్యవతి, మేడే మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహనానికి ప్రతిరూపం మహిళ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూరిశెట్టి కల్పన

భీమవరం (ప్రకాశంచౌక్): సహనానికి ప్రతి రూపం మహిళ అని, భూదేవి అంత ఓర్పు మహిళలకే ఉంటుందని ఆలిండియా వెల్ఫేర్ అసోసియేషన్ బీసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సూరిశెట్టి కల్పన అన్నారు. విజ్ఞాన వేదిక అధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా భీమవరం వీఎస్‌కే కళాశాలలో విద్యార్థులకు పోటీలు, ర్యాలీ, మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కల్పన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎంతో గొప్ప స్థానం ఉందని, మహిళా దినోత్సవం స్ఫూర్తిని ప్రతి రోజూ కొనసాగించాలన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి గంధం శ్రీదేవి, అధ్యాపకురాలు నాచు శ్రీవల్లి, ప్రిన్సిపాల్ వైవీఎల్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ భవానీ మాట్లాడుతూ మహిళా మణి లేని ఇల్లు దీపం లేని కోవెల వంటిదన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారన్నారు. గంగనమ్మ దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. షేహానాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



కొత్త బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు ఎన్నికల సందర్భంగా కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో కొత్తబస్టాండ్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఆటో కార్మికులకు గుదిబండగా ఉన్న జీఓ నంబర్ 2131ను రద్దు చేయాలని, వాహన మిత్రలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టాటా ఏస్, కార్లు జీపులపై భారీగా పెంచిన రోడ్ ట్యాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ ట్యాక్స్, లేబర్ ట్యాక్స్ టోల్గేట్ ఫీజులను 30 శాతానికి తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు కడలి హరిబాబు, అధ్యక్షుడు చెన్నంచెట్టి వాసు, ఉపాధ్యక్షుడు జయకుమార్, కార్యదర్శి వీరవల్లి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

డ్రోన్ల పర్యవేక్షణలో కళాశాలలు



విష్ణు కళాశాల వద్ద డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్న సీఐ బంటుమిల్లి శ్రీనివాస్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఆర్‌కేఆర్, విష్ణు, తదితర కళాశాలల చుట్టూ డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ చేస్తున్నామని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంటుమిల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ పుంతలో మంగళవారం విష్ణు కళాశాల వద్ద డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ బంటుమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న సాంకేతను అందిపుచ్చుకుని నేరాలను అధిగమిస్తున్నామన్నారు. కళాశాలల చుట్టు పక్కల అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై ఐ.వీర్రాజు, హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లైన్‌మెన్లకు పురస్కారాలు



లైన్‌మెన్‌లను సత్కరిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): లైన్‌మెన్ దివస్ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో ఉత్తమ సేవలు అందిస్తున్న 13 మంది విద్యుత్ లైన్‌మెన్లకు అత్యుత్తమ సేవా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆలపాటి రఘునాథబాబు సత్కరించారు. కార్యక్రమంలో ఎం.జాన్సీ, ఎస్.వెంకటేశ్వరరావు, కె.నర్సింహమూర్తి, కె.మధుకుమార్, బి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

వీరవాసరం: అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులైన తోటరాంపండు, గన్నమణి అమ్ములు కుటుంబ సభ్యులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యవసర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి వెంకట్రావు, గెడ్డం భాస్కరరావు, మార్తమ్మ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థినులు

భీమవరం (ప్రకాశంచౌక్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికారవారోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. మహిళా భద్రతే ప్రాధాన్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. సీఎస్ఎన్ కళాశాల విద్యార్థినులకు మహిళా సంబంధిత చట్టాలు, సైబర్ క్రైం, పోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, ఆకతాయిల వేధింపుల నుంచి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత నేరాలపై అవగాహన కల్పించారు.